Namasthe Telangana                                   Dt 08/05/16

# ప్రీకాస్టింగ్ నిర్మాణమే శ్రేయస్కరం

**ఢిల్లీ ప్రతినిధి బృందంతో హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :** మెట్రో నగరాల్లో చేపట్టే మెగా ప్రాజెక్టులను ప్రీకాస్టింగ్ విధానంలో నిర్మించడమే అత్యంత శ్రేయస్కరమని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము మెట్రోరైల్ ప్రాజెక్టును 85శాతం ప్రీకాస్టింగ్‌లోనే నిర్మించామని, ఇందువల్లే ట్రాఫిక్‌జామ్‌లు, రోడ్డు మళ్లింపులు లాంటి సమస్యలు ఎదురుకాలేదని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో మెగా ప్రాజెక్టులు చేపడితే ఎదురయ్యే సవాళ్లు.. వాటిని ఎదుర్కోవడంపై అధ్యయనం చేయడానికి ఢిల్లీకి చెందిన ప్రతినిధులు హెచ్ఎంఆర్ ప్రాజెక్టును ఎంచుకున్నారు. ఢిల్లీ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి సర్వజ్ఞ శ్రీవాస్తవ నేతృత్వంలో బృందం హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డితో భేటీ అయ్యింది. ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్, రవాణా ఆధారిత అభివృద్ధి ప్రాజెక్టులు, ఫ్లైఓవర్లను పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే ఆలోచనతో ఉన్న వారు ఒక రోజు అధ్యయనం కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ మేరకు శనివారం మెట్రోభవన్‌లో హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డితో పాటు ఇతర సీనియర్ ఇంజినీర్లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మెట్రోరైల్ ప్రాజెక్ట్‌లో ఎదురైన సవాళ్లపై ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. న్యాయపరమైన చిక్కులు, మతపరమైన కట్టడాలు, ఆస్తులు సేకరణ, రైట్ ఆఫ్ దివేకు అడ్డంకులను ఎలా ఎదుర్కొన్నది వివరించారు. విద్యుత్ స్తంభాలు, మంచినీటి, మురుగునీటి పైపులైన్లను తరలించడంలో చాకచక్యంగా వ్యవహరించామని, ఒకే ఒక్కరోజు వ్యవధిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయగలిగామన్నారు. దృఢసంకల్పం, అపారమైన సహనంతో, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తేనే నగరాల్లో ప్రాజెక్టులను చేపట్టగలమని అన్నారు. అనంతరం ప్రతినిధుల బృందం మెట్రోస్టేషన్లతో పాటు, ఉప్పల్ డిపోను సందర్శించింది.



ఢిల్లీ బృందంతో సమావేశమైన ఎన్వీఎస్ రెడ్డి